# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 30 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08


## నేటిలోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి, నేటిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో మండలవ్యవసాయ విస్తరణ అధికారులు,మండల వ్యవసాయ అధికారులతో సమీక్షా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న డిజిటల్ పంటల సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు వివిధ అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో

తరువాయి 2లో

# అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు చిన్న వయస్సు నుంచే సరైన పోషకాహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. 9వ పోషణ మాసంలో భాగంగా 'మన అంగన్వాడీ–మన బాధ్యత' కార్యక్రమం కింద మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన 'ప్రతి మంగళవారం 10 నిమిషాలు' కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలు, పోషకాహారం, పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు.

**పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది:** పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నువ్వులు, బాలామృతంతో తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. చిన్నారులకు అందించాల్సిన సమతుల ఆహారం, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం 10 నిమిషాల కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో వసతుల మెరుగుదల, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో మొత్తం 586 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటి



తరువాయి 2లో

## ముఖ్యమంత్రి పర్యటనకు
# పటిష్ట భద్రత ఏర్పాట్లు



### 1600 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో కళ్యాణ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి విధుల నిర్వహణపై పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో పాటించాల్సిన భద్రతా చర్యలు, విఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై పలు సూచనలు చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా బందోబస్తు 12 సెక్టార్లుగా విభజించి సుమారు 1600 మంది అదనపు ఎస్పీలు 2, డిఎస్పీలు 15, సిఐఆర్ఐ 50, ఎస్ఐఆర్ఎస్ఐలు 148, ఏఎస్ఐహెడ్ కానిస్టేబుల్ 328, కానిస్టేబుల్ లు 482, మహిళా సిబ్బంది 121, హోమ్ గార్డులు 196, బెటాలియన్ సిబ్బంది 60, డిస్టిక్ గార్డ్స్ 190 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధికారులు సిబ్బందికి కేటాయించిన డ్యూటీ పాయింట్స్‌లలో అప్రమత్తంగా ఉంటూ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాల్లో ట్రాఫిక్ విధులలో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కోమ్) ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో పలు ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జర్మనీ,ఇజ్రాయెల్, ఆస్ట్రియా, ఐర్లాండ్, సౌదీ అరేబియా, మారిషస్, ఖతార్,దుబాయ్,ఒమన్,మలేషియా, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో వివిధ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జర్మనీ లో నర్సులకు నెలకు యూరో2,800, 2,800–3,000, ఫిజియోథెరపిస్ట్, ఉద్యోగాలకు 2,500–2,900 వరకు వేతనాలు లభిస్తాయని, ఇజ్రాయల్లో నెలకు రూ.1,99,000కు పైగా వేతనం, ఆస్ట్రియా లో నర్సులకు 2,800 వేతనం లభిస్తుందని, ఐర్లాండ్ లో 3,100 వేతనం అందుబాటులో ఉందనీ,సౌదీ అరేబియా5,400 వేతనం ఉందని, మారిషస్ లో రూ.59,000, రూ.71,000 వేతనం,ఖతార్ లో 5,000 వరకు వేతనం, దుబాయ్: క్యాబ్ డ్రైవర్ కు నెలకు 2,500–3,500, ఈ బైక్ రైడర్స్ కు కు 2,500–6,000, వివిధ రంగాల్లోని వర్కర్లకు 1,453, 1,200 వరకు వేతనం, ఒమన్ తదితర ఉద్యోగాలకు గంటకు $26.44 వరకు వేతనాలు ఉన్నాయని వెల్లడించారు.విదేశాల్లో ఉద్యోగ అవకాశాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా ఉపాధికల్పనాధికారి కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, రూమ్ నెం. 233లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం08035524946, 8125737731, 9291237999, 0423342040 నంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రేషన్ బియ్యానికి పాలిషింగ్
# ప్రముఖ బ్రాండ్ల పేరిట అమ్మకాలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టించి వాటికి పాలిష్ పట్టి ప్రముఖ బ్రాండ్ల పేరిట అధిక ధరలకు విక్రయిస్తున్న ఘరానా మోసాన్ని కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ సతీష్ నేతృత్వంలో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో 307 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ఏసీపీ సతీష్ తన బృందంతో కలిసి కరీంనగర్ పరిసర ప్రాంతాల్లోని పలు గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లపై దాడులు నిర్వహించారు. పేదల నుండి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న కొందరు వ్యాపారులు, వాటిని ప్రత్యేక యంత్రాల ద్వారా పాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నట్లు అధికారులు కనుగొన్నారు. అనంతరం ఆ బియ్యాన్ని జై శ్రీరామ్ తో పాటు ఇతర బ్రాండ్ల పేర్లు ముద్రించిన సంచుల్లో నింపి మార్కెట్‌లో అసలైన సన్న బియ్యంగా అధిక ధరలకు అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. దాడుల్లో లభ్యమైన 307 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కరుణాకర్ అనే వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే దానిపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు సమాచారం.



# మండల కేంద్రంలో ప్రమాదకరంగా కరెంట్ పోల్

ప్రజాపక్షం/గన్నేరువరం: గన్నేరువరం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం వాహనదారులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుజేస్తుంది. ప్రధాన రహదారి మలుపు వద్దే ఈ స్తంభం ఉండడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం అనేక వాహనాలు, పాఠశాల బస్సులు పాదచారుల రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదాలు జరిగితే తప్పు అధికారులు నిద్ర మత్తు వదలలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గన్నేరువరం ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



## బస్టాండ్‌ను పరిశీలించిన డిపో మేనేజర్



ప్రజాపక్షం/చొప్పదండి : చొప్పదండి బస్ స్టేషన్‌ను కరీంనగర్ 2 డిపో మేనేజర్ రవీంద్రనాథ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్ వేళల రిజిస్టర్ తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. అనంతరం బస్ స్టేషన్ ప్రాంగణంలో గల సదుపాయాలను పరిశీలించి ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## దళిత ప్రొటెక్షన్ ఫోర్స్ జిల్లా కన్వీనర్‌గా వినయ్ సాగర్

ప్రజాపక్షం/గంగాధర : తెలంగాణ రాష్ట్ర దళిత్ ప్రొటెక్షన్ ఫోర్స్ కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా గంగాధర మండలానికి చెందిన కొండాయపల్లి గ్రామ సర్పంచ్ మాల్యాల వినయ్ సాగరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల మాదరగోని ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు జిల్లాల్లో దళితుల భూములు, ఇండ్ల స్థలాల వివక్ష, దాడుల సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు రమణ, ప్రసాద్, అఖిలేష్ కుమార్, లక్ష్మణ్, రామ్మూర్తి, సురేష్, లింగన్న, కనుకరాజ్ పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా వినయ్ సాగర్‌ను జిల్లా కన్వీనర్‌గా ఎన్నుకున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఎం.రమణ ప్రకటించారు.

## బచ్చు భాస్కర్‌కు ఘన సన్మానం

ప్రజాపక్షం/జమ్మికుంట: కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాటన్ బిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన జమ్మికుంటకు చెందిన బచ్చు భాస్కర్‌ని మంగళవారం అభయాంజనేయ స్వామి దేవాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు డింగరి హరికృష్ణ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరికృష్ణ ఆచార్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, విశ్రాంత ఏఈ కేదారేశ్వర్, పి.సమ్మారావు, వెంకటేశ్వర్లు, సుంకర యాదయ్య, సమ్మయ్య తదితరులు బచ్చు భాస్కర్‌ను సత్కరించారు.



## ఆరోగ్యమే అసలైన సంపద



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్: ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే దాని ప్రభావం గుండెపై పడే అవకాశముందని ఆరోగ్యమైన జీవన శైలిని అలవర్చుకోవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవడంతోపాటు సంతోషంగా ఎక్కువ కాలం జీవించవచ్చని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అన్నారు. వరల్డ్ హార్ట్‌డే పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం 3కె వాకథాన్ నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి నుంచి కోర్టు చౌరస్తా, తెలంగాణ చౌక్ మీదుగా తిరిగి ఆసుపత్రి వరకు సాగిన వాకథాన్‌ను సీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటేనే కుటుంబంతో సమాజంతో సంతోషంగా గడపగలమన్నారు. నిత్యం వ్యాయామం చేయడం, పోషక విలువలు గల ఆహారం తీసుకోవడం ఒత్తిడిని తగ్గించడం, సరిపడా నిద్రపోవడం మానసిక ప్రశాంతంగా ఉండడం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతాయన్నారు. ఆరోగ్యమే అసలైన సంపద అని అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వైద్యులు మాట్లాడుతూ గుండె జబ్బు లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వస్తే 24 గంటల్లో స్టంట్ వేసి పంపించే ఆధునిక టెక్నాలజీ కరీంనగర్‌లో అందుబాటులో ఉందన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వాకథాన్‌లో కార్డియాలజిస్టులు డా.అనిష్ పబ్బ, డా.వాసుదేవరెడ్డి, డా.సతీష్ కుమార్, సిటి సర్జన్ డా.రవి కుమార్, డా. వినయ్ కుమార్, డా.విష్ణువర్దన్ రెడ్డి, జనరల్ ఫిజిషియన్లు డా.నాగరాజు, అభిషేక్, యూరాలజిస్టు డా.రవిశంకర్, ఈఎన్‌టీ డా.శ్రీపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ప్రపంచ గుండె దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/కొత్తపల్లి : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండదానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని వాటి అమలుకై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటిక్నో పాఠశాలలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెనీ హాస్పిటల్ సంయుక్తంగా ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సిపిఆర్ ప్రదర్శన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గుండె జబ్బుల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు తెలియజేయడం నివారణ చర్యలను వివరించడమే కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం, నడవడం ద్వారా గుండెను జాగ్రత్తగా ఉంచుకోవచ్చన్నారు. డా.బంగారు స్వామి మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ రోజు వివిధ కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. సీపీఆర్ విధానాన్ని డా.బి.దీక్షిత్ వర్ణించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డా.ఆకుల శైలజ, కార్యదర్శి డా.ఎన్.మహేశ్ బాబు, కోశాధికారి డా.వి.నీలిమ, డా.రాజేంద్ర ప్రసాద్, డా.బి.దీక్షిత్ , డా.సౌరంగ్ , ఆచార్య వద్దూరి శ్రీనివాస్, ఎం.అరవింద్ బాబు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి నాయకులు



ప్రజాపక్షం/జమ్మికుంట : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ హిందూ దేవుళ్లను కించపరిచేలా రాముడు పైన ఉన్నవారికి దేవుడని, శివుడు పేదల దేవుడని హిందువుల మనోభావాలను దెబ్బతినే విధంగా మాట్లాడడం ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం అంటూ వ్యాఖ్యానించడాన్ని నిరసిస్తూ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంట గాంధీ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులు భారీగా మోహరించి దిష్టిబొమ్మ దగ్ధాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులకు బిజెపి నాయకులకు స్వల్ప తోపులాట జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు గొలకాని రాజు , ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు జీడి మల్లేశ్ లు మాట్లాడుతూ కేవలం ఓ వర్గం ఓట్ల కోసం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందువులకు క్షమాపణ చెప్పడంతోపాటు ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు చాతకాక డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు దొంతరవేన రమేశ్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కైలాసకోటి గణేశ్, పూల్లూరి ఈశ్వర్, బచ్చు శివన్న, పల్లపు రవి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ఆకుల పోచయ్య, యువమోర్చా అధ్యక్షుడు తుర్పాటి శంకర్, మైనార్టీ అధ్యక్షులు నసీరుద్దీన్ ఉడుగుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు కలిపి సుమారు 40 వేల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలతో పాటు ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

**పిల్లల ఎత్తు, బరువుపై ప్రత్యేక దృష్టి:** ఆరేళ్ల లోపు పిల్లలను తల్లిదండ్రులు ప్రతి నెల క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. పిల్లల ఎత్తు, బరువును నమోదు చేయించి, వారి ఎదుగుదలకు అనుగుణంగా అవసరమైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. చిన్నారులను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల పోషకాహారంతో పాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా ప్రాథమిక విద్య, మంచి అలవాట్లు అలవడతాయని వివరించారు. అధికంగా చక్కెర పదార్థాలు ఇవ్వకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేయాలని తెలిపారు.

**తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి:** తల్లులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. దేశంలో సుమారు 54 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొంటూ, రక్తహీనత ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏఎన్సీ పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఎదుగుదల లోపాలను గుర్తిస్తే వెంటనే సమాచారం:** ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు కనిపిస్తే సమీప అంగన్వాడీ కేంద్ర సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఎదుగుదల లోపాలు, వినికిడి లేదా మాట సమస్యలు, మానసిక అభివృద్ధి లోపాలు, నడవడంలో ఇబ్బందులు, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడుకు సంబంధించిన సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఉన్న పిల్లలను అంగన్వాడీ సిబ్బంది గుర్తించి వైద్యులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, లక్ష్మీరాజం, ఏంజెలా ఆల్ఫ్రెడ్, రజనీ, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ నరసింహులు, మండల విద్యాధికారి కృష్ణ హరి, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేటిలోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి

మొదటి పేజీ తరువాయి

జాప్యం లేకుండా నేటిలోగా పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని తెలిపారు. డిజిటల్ పంటల సర్వే పూర్తికాకపోవడం వల్ల సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు కూడా బోనస్ కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతుకు సంబంధించిన పంట వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంపిక చేయబడిన వాలంటీర్లను పర్యవేక్షిస్తూ,ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా డిజిటల్ పంటల సర్వేను పూర్తిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు,సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## పారమిత విద్యార్థులకు ఆత్మ రక్షణపై అవగాహన

ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్ జిల్లా అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్ కుమార్ నేతృత్వంలో మంగళవారం ఆత్మ రక్షణపై అవగాహన కార్యక్రమం కరాటే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కరాటేలోని కటా, స్పారింగ్ , ఆత్మరక్షణ పద్ధతులను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వివిధ స్థాయిల బెల్టులను సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, ప్రసాద్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ మొయినుద్దీన్, రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంధ్యారాణి వివాహానికి ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణ కేంద్రానికి చెందిన మెలుగూరి రమేష్–మనోహరిని దంపతుల కుమార్తె సంధ్యారాణి వివాహం త్వరలో జరగనుండగా ధర్మపురి,బుగ్గారం మండలాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాదినేని రాజేందర్ – రాజమణి దంపతులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.ధర్మపురి మండల మాజీ ఎంపిపి, మాజీ సింగిల్ విండో చైర్మన్, మాజీ జడ్పీటీసి సభ్యురాలు, బుగ్గారం మండల తాజా, మాజీ ఎంపిపి, జడ్పీటీసీగా సేవలందించిన బాదినేని రాజేందర్ – రాజమణి దంపతులు మంగళవారం మెలుగూరి కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించి రూ.1,00, 116 నగదును అందజేయడంతో పాటు నూతన వస్త్రాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరికొండ అశోక్, ఉయ్యాల రాజు గౌడ్, పాల్గొన్నారు.

## కోజన్ కొత్తూరులో డిఎల్‌పిఒ పర్యటన



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూరు గ్రామంలో మంగళవారం మెట్పల్లి డిఎల్‌పిఒ రాజేంద్రప్రసాద్ పర్యటించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూపొందించిన "స్వచ్ఛతా సే సమృద్ధి", "కబాడ్‌సే కళా" ప్రదర్శనలను పరిశీలించి వారి సృజనాత్మకతను డిఎల్‌పిఒ అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్, ఎంహెచ్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంకితభావంతో అంగన్వాడి టీచర్లు



ప్రజాపక్షం /మల్లాపూర్ : గ్రామాల్లో ప్రజారోగ్యం సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తూ అంగన్వాడీ టీచర్లు ఎంతో అంకితభావంతో పనిచేస్తారని బిజెపి రాష్ట్ర నాయకురాలు పూదరి అరుణ అన్నారు.ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో అంగన్ మిలాన్ సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించి అంగన్వాడీ టీచర్లను ఆశ కార్యకర్తలను శాలువాతో సన్మానించారు. అదేవిధంగా పండిట్ దీందర్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గోల్డెన్ మ్యాంగో మొక్కను న నాటి పండిట్ దీన్ దయాల్ సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నాగ రాజు, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు భూక్య శేఖర్, కార్యకర్తలు ముత్యాల గంగా రాజం,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం



ప్రజాపక్షం /పెగడపల్లి : అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం నుండి లభించే సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాటం మంగవ్వ నర్సింహా రెడ్డి దంపతులకు ప్రభుత్వం నుండి మంజూరు అయిన రెండు లక్షల రూపాయల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆరోగ్యశ్రీ పరిమితిని ఏకంగా పది లక్షల రూపాయల వరకు పెంచి పేదల ప్రాణాలకు భరోసా కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విజయ్ భాస్కర్, కిషన్, శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంధి మల్లారెడ్డి,పూసాల తిరుపతి,రవి నాయక్, సుంకరి రవి, సత్యనారాయణ రెడ్డి, మహేందర్,రాజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మండల వ్యవసాయాధికారి మహేష్



ప్రజాపక్షం/ఎండపెల్లి :రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవనిమండల వ్యవసాయాధికారి మహేష్ పేర్కొన్నారు.ఎండపల్లి మండలంలోని వివిధ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి మహేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించడంతో పాటు నిల్వ రిజిస్టర్లు, విక్రయ బిల్లులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ప్రతి అమ్మకానికి రైతులకు తప్పనిసరిగా బిల్లు అందించాలని స్పష్టం చేశారు.అనుమతి లేని కంపెనీల నిల్వలను ఉంచినా, లైసెన్సులో నమోదు కానీ కంపెనీల ఉత్పత్తులను అమ్మినా,ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా దుకాణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరాముడు, శివుడిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం ధర్మపురి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం నిర్వహించారు. బిజెపి ధర్మపురి పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బిజెవైఎం నాయకులు మండలజ్ సూరజ్ మాట్లాడుతూ, రాజకీయాల కోసం ప్రజల విశ్వాసాలు, దేవుళ్లను వివాదంలోకి తీసుకురావడం సరికాదన్నారు. ప్రజల మత విశ్వాసాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యాఖ్యలు చేయాలని సూచించారు.శ్రీరాముడు, శివుడిపై చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై బిజెపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రజల మధ్య మతపరమైన విభేదాలు పెరగకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడుఎండోమెంట్ ధార్మిక శాఖ జిల్లా కోకన్వీనర్ కలకోట రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు సుంకం మధు, మండల ఉపాధ్యక్షుడు ఒగేటి అంజన్న,పట్టణ కార్యదర్శి ఠాగూర్ రాకేష్, కొత్తపల్లి కిషన్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కాశెట్టి హరీష్, పాల్గొన్నారు.

# పరీక్షలతో బోధనకు ఆటంకం

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల ఆవేదన



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రభుత్వ పాఠశాలల్లో అక్టోబర్ 1వ తేదీ నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (SA1) పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడం, విద్యార్థులకు రివిజన్ చేయించడం కష్టంగా మారిందని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సెప్టెంబర్ 24వ తేదీ నుంచి విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు,సమావేశాలు నిర్వహించడంతో ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధనకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోయారని తెలిపారు.సెప్టెంబర్ 25, 26 తేదీల్లో డిజిటల్ శిక్షణ,మరో రోజు కాంప్లెక్స్ సమావేశం వంటి కార్యక్రమాలకు హాజరు కావాల్సి వచ్చిందని పేర్కొన్నారు.ఇక గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల కారణంగా ఇప్పటికే విద్యార్థుల హాజరు తగ్గిందని, అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా కూడా రెండు రోజుల పాటు పలువురు విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు.దీంతో నిర్వహించడం తమకు సవాల్‌గా మారిందన్నారు.ఇకనైనా విద్యాశాఖ అధికారులు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులకు బోధనకు తగిన సమయం కల్పించాలని వారు కోరుతున్నారు.

# కష్టకాలంలో జర్నలిస్టుకు అండగా ఐజెయు

ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు

నాగరాజుకు రూ.22 వేల సాయం

ప్రజాపక్షం /మెట్‌పల్లి : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జగిత్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్టు నాగరాజును ఐజేయూ మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, రూ.22 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాగరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.జర్నలిస్టుల సంక్షేమానికి ఐజేయూ మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ కట్టుబడి ఉందని అధ్యక్షుడు బూరం సంజీవ్,జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు దాసం కిషన్, మహమ్మద్ అఫ్రోజ్ పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ధూప దీప నైవేద్య సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ ధూప దీప నైవేద్య సంఘం ధర్మపురి మండలంలోని అర్చకుల నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం ధర్మపురిలోని శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య సంఘం గౌరవ అధ్యక్షులు ఏటూరి అంజనేయచారి హాజరై, నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం : మండల అధ్యక్షులు: బూస ప్రవీణ్ కుమార్ ఉపాధ్యక్షులు: పెరంబదూరి శ్రీధరాచార్య గౌరవ అధ్యక్షులు: పెంటగంగారం ప్రధాన కార్యదర్శి: పాంచాల లక్ష్మీ కాంతచారి కోశాధికారి: పెరంబదూరి శ్రీనయన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్: పురాణపు సాంబమూర్తి తదితరులు ఎన్నికయ్యారు. అర్చకుల సంక్షేమం, సంఘ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం విశ్వ హిందూ పరిషత్ గొల్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ ఎస్ బాలికల ఉన్నత పాఠశాల,జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల మరియు తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ నేటి విద్యార్థులకు కేవలం నైపుణ్యాలు, కర్మ సిద్ధాంతం మరియు సత్ప్రవర్తన ఎంతో అవసరం .ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు సొతల్ల లక్ష్మణ్ ,మండల అధ్యక్షులు ఎనగందుల రమేష్ ,మండల ప్రధాన కార్యదర్శి గంగాధర మధుసూదన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయ బృందం ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు .

## జగన్ కుటుంబానికి ఆర్ఎంపి–పిఎంపి సంఘం ఆపన్న హస్తం

ప్రజాపక్షం/గొల్లపల్లి : ఇటీవల మృతి చెందిన గుల్లకోట ఆర్ఎంపీ డాక్టర్ జగన్ కుటుంబానికి గొల్లపల్లి మండల ఆర్ఎంపీ–పీఎంపీ మిత్రులు మానవతా దృక్పథంతో ఆపన్నహస్తం అందించారు. సహచరుడి మృతితో విషాదంలో ఉన్న కుటుంబానికి తమ వంతు సహాయం అందిస్తూ అండగా నిలిచి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జగన్ మృతి ఆర్ఎంపీ–పీఎంపీ మిత్రుల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని,ఒక సహచరుడిని కోల్పోవడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు.ఈ కష్ట సమయంలో జగన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుసుమ శంకర్, గౌరవాధ్యక్షులు సాయిని నరహరి, ఉపాధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ముత్యంపేటలో పోషక మాస వారోత్సవాలు

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని ముత్యంపేట గ్రామ అంగన్వాడి కేంద్రాలలో పోషక మాస వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తెలు నరేష్ ఎంపీడీవో శ్రీకాంత్ సూపర్వైజర్ శోభారాణి పాల్గొని పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని జరిపించారు. గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్ సర్పంచ్ నరేష్ ఐస్ డిఎస్ సూపర్వైజర్ శోభారాణి,పంచాయతీ కార్యదర్శులు మురళి అంగన్వాడీ టీచర్లు ఆమేటి శ్రీలత,దాసరి లక్ష్మి ,కృష్ణవేణి, గర్భిణీలు, పాల్గొన్నారు.

## వరిలో తెగుళ్ల నివారణకు సూచనలు

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి మండలంలోని రాజారాం, జైన గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జగిత్యాల కోఆర్డినేటర్ డా. ఐ. తిరుపతి, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ వరి పొలాలను పరిశీలించారు. చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలో కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగులు,ఆకుముడతలను గుర్తించారు.కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు సంబంధిత మందులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు సొల్ల భీమయ్య, సాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సభను విజయవంతం చేయండి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : అక్టోబర్ 1,గురువారం ఉదయం 11 గంటలకు నిర్మల్ డిపో ఆవరణలో జరిగే ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు.సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హన్మంత్, పిన్నయ్య, కరణ్ సింగ్, కె.కె. దాస్, బుర్ర ప్రకాష్, లీలారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సమన్వయ కూటమి నాయకులు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎ.ఆర్. రెడ్డి,దామోదర్ రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. కావున కార్మికులు,ఉద్యోగులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ధర్మోరలో యూనిఫాంల పంపిణీ చేసిన సర్పంచ్



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలం ధర్మోర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్ ) లో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ విద్యార్థులకు సర్పంచ్ మరియు గ్రామస్తులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని,విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంద గణేష్ పంచాయతీ సెక్రెటరీ పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ సమీక్ష సమావేశం

ప్రజాపక్షం/బోథ్ : ఈ సందర్భంగా ఈ.ఆర్.ఓ.ఐ.టి.డి.ఏ.మాట్లాడుతూభారత ఎన్నికల సంఘం విడుదల చేసిన సవరించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)–2026 షెడ్యూల్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఇందులో భాగంగా నోటీసు పెండింగ్ డెలివరీ, నోటీసు హియరింగ్ షెడ్యూల్ ప్రకారం కంప్లీట్ చేయుమని చెప్పడం జరిగింది. స్పెషల్ కాంపిటీషన్ దే వచ్చిన రైలులు 6, 7, 8 బిఎల్ఓ ద్వారా ఎంక్వయిరీ చేసి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయుమని తెలిపారు.09.11.2026న తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల శాఖ అధికారులు (ఎఇఒస్), సంబంధిత అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్‌సి డిపార్ట్‌మెంట్ నిర్మల్ నియోజకవర్గ చైర్మన్‌గా కత్తి నియామకం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : టిపిసిసి ఎస్‌సి డిపార్ట్‌మెంట్ నిర్మల్ నియోజకవర్గ చైర్మన్‌గా కత్తి నరేందర్ ఈరోజు నియమితులయ్యారు. ఎస్‌సి డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్,ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ సమతా సుదర్శన్,ఎస్సీ డిపార్ట్‌మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ తూర్పటి వెంకటేష్,ఎస్‌సి డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు కట్ట శ్యామ్ సుందర్ ల అధ్యక్షతన ఈ నియామకం జరిగింది.

# దళారుల దందాకు అడ్డుకట్ట పడేదెప్పుడు?

ప్రజాపక్షం/ముథోల్ : సోయా కోత ప్రారంభమైందో లేదో అరుగాలం కష్టపడి పండించిన పంటను రైతుల నుండి కొనుగోలు చేయడానికి దళారులు తమ దందాను మొదలు పెట్టారు.చిన్న,సన్న కారు రైతులకు ఒక ధర పెద్ద పెద్ద భూస్వాములకు మరో ధర పెడుతూ వారికిష్ట మొచ్చిన ధరను నిర్ణయిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు తేమ శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తారు.ఎక్కువ తేమ శాతం తక్కువ ధర ,తక్కువ తేమ శాతం ఉంటే ఎక్కువ ధర నిర్ణయిస్తున్నారు.అంతే కాకుండా ప్రతి క్వింటాలుకు 2కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు.తేమ శాతం రైతులకు మాత్రమే కానీ వీరు కొనుగోలు చేసిన పిదప తక్కువ తేమ శాతం ఉన్న ధాన్యం,ఎక్కువ తేమ శాతం ఉన్న ఒకే దగ్గర కలిపి దాన్ని సంచుల్లో నింపి అమ్ముకోవడానికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.కష్టపడి పండించిన రైతుకో నిబంధ



నలు,ఎలాంటి కష్టం లేకుండా ఏ అనుమతులు లేకున్నా దళారులకు మాత్రం నిబంధనలు లేవు.ఇలా చిన్న ,సన్న కారు రైతులను లక్ష్యంగా చేసుకుని దళారులు తమ దందాను నడుపుతూ అడపాదడపా సంపాదిస్తున్నారు.ముథోల్ లో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భైంసా మార్కెట్ కమిటీ తరపున ఏమైనా అనుమతులు ఇచ్చారా అని సంబంధిత సెక్రటరీని అడగ్గా సమాధానాన్ని దాటవేస్తున్నారు.మరి వీరి దళారి దందాను అడ్డుకుంటారా లేదా వీరిని అధికారులు ప్రోత్సహిస్తారా చూడాలి!

# మూత్రశాలగా మారిన గ్రంథాలయం!

### గ్రంథాలయ ఆవరణలో బహిరంగ మల,మూత్ర విసర్జన

ప్రజాపక్షం /దిలావర్ పూర్ : నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండల కేంద్రంలోని గ్రంథాలయ పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గ్రామ పంచాయతీ ఆవరణ మరియు గ్రంథాలయం ఒకే చోట ఉన్నపటికీ చుట్టుప్రక్కల వారికి ఇదే మూత్రశాలాగ మారిపోయింది.గ్రంథాలయానికి శాశ్వత సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బందికి రెండు మండలాలలో వారానికి మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు.గేటు ఉన్నపటికీ అక్కడ మహిళ విద్యార్థులు ఉన్నారనే ఇంగితం లేకుండా మూత్రవిసర్జనకు వెళుతున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆవరణలోకి ప్రవేశించి బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. దీనివల్ల పరిసరాలన్నీ తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి.ఈ దుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న



మహిళా సిబ్బంది కి ఈ పరిస్థితి మారింది. ఒకవైపు భరించలేని దుర్గంధం, మరోవైపు ఆకతాయిల సంచారంతో మహిళా సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి,మానసిక ఆందోళనకు గురవుతున్నారు.ఇక్కడ పుస్తక పఠనానికి వస్తున్న మహిళా విద్యార్థినులకు కనీస మౌలిక సదుపాయాలు లేవు, ప్రతిరోజూ ఈ దుర్వాసన ఇప్పటికైనా సంబంధిత అధికారులు , స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గ్రంథాలయ ఆవరణలోకి అపరిచితులు రాకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, అలాగే విధుల్లోకి శాశ్వత సిబ్బంది నీ ఏర్పాటు చెయ్యాలని పాఠకులు కోరుతున్నారు.

# పిఆర్‌సి ప్రకటించకపోతే ఉద్యమిస్తాం

### టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి

ప్రజాపక్షం / సిర్పూర్ (టి): రాష్ట్రంలో రెండో పిఆర్‌సి నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటానికి సిద్ధమవుతామని టిఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి స్పష్టం చేశారు. సిర్పూర్ (టి)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ ఉన్న రెండు డిఎల జిఒ విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికి కమిటీ వేయాలని కోరారు. పెండింగ్ బిల్లుల విడుదలకు నెలవారీ పరిమితిని రూ.2,000 కోట్లకు పెంచాలన్నారు. జిఒ 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయు



డిని నియమించాలని, ఆన్‌లైన్ బోధనేతర పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సమాన వేతనం, జిఒ 317 బాధితులకు న్యాయం, హెల్త్ కార్డుల పూర్తి వినియోగం సహా ఎన్నికల మేనిఫెస్టోలోని 64 సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వాసగి మాధవి, పద్మావతి, మీనా, మౌనిక పాల్గొన్నారు.

# పనిముట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

### ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు చిన్నయ్య

ప్రజాపక్షం / శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పనిముట్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు సీలం చిన్నయ్య హామీ ఇచ్చారు. నూతనంగా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మంగళవారం తొలిసారిగా ఎస్ఆర్‌పి3 గనిని సందర్శించి కార్మికులను కలుసుకున్నారు. డి.వీరమల్లు, గణపతి మహేష్, ఏల్పుల ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిముట్ల కొరతపై కార్మికులు ఆయన దృష్టికి తేవడంతో, ఈ విషయాన్ని సింగరేణి యాజమాన్యంతో పాటు ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్, కేంద్ర కమిటీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.ఐఎన్‌టియుసి కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సల్లంగి శ్రీనివాసరావు, కారుకూరి మనోజ్‌కుమార్, ఈ.శంకర్, ఇండ్ల కిరణ్, బొడ్డు ప్రసాద్, జి.లక్ష్మణ్, ఎస్.సతీష్‌కుమార్, జుంబిడి సంపత్, శ్రీనివాస్, బుషి దేవ్, మిట్ట తిరుపతి, సదన్న, గణేష్, సాయి పాల్గొన్నారు.



## ఆదర్శ పాఠశాల తనిఖీ చేసిన ప్యానల్ బృందం



ప్రజాపక్షం/బోథ్ : బోట్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ప్యానెల్ బృందం తనిఖీ నిర్వహించారు. పర్యవేక్షణలో భాగంగా తరగతి గదులు నిర్వహణ,రిజిస్టర్లు,గ్రంథాలయంను లాబరేటరీ, పాఠశాల ప్రాంగణంను మధ్యాహ్న భోజనం పాఠశాలలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి సలహాలు సూచనలు తెలియజేశారు.విద్యార్థులతో మమేకమై ఆటల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ అనురాధ సంతోషం వ్యక్తి పరుస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ బృందం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శోభ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గుండంపల్లి పాఠశాల విద్యార్థులకు టీ-షర్టుల వితరణ



ప్రజా పక్షం /దిలావర్ పూర్ : గుండంపల్లి గ్రామ వాస్తవ్యులు ప్రముఖ న్యాయవాది కెవిఆర్ వ్యవస్థాపకులు అయినా కొమ్ముల వినాయక్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి యొక్క వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థులందరికీ 50వేల రూపాయల విలువగల టీ షర్ట్, ప్యాంట్ తో కూడినటువంటి యూనిఫామ్ ను విద్యార్థులకు అందించారు.తండ్రి మల్లన్న జ్ఞాపకార్థంగా విద్యార్థులందరికీ అందజేశారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద మధ్య తరగతి విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిలారి మధుసూదన్ అన్నారు.ఈ కార్యక్రమంలో కె.వి.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొమ్ముల వినాయక్ రెడ్డి,బంధు వర్గం మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాగా పూర్‌లో చెత్త బుట్టలు పంపిణీ చేసిన సర్పంచ్



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలో ని బాగాపూర్ గ్రామంలో సర్పంచ్ శ్రీ వేద ప్రణీత్ రెడ్డి ఎంపీఓ సోలామన్ రాజ్ గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి చెత్తబుట్టలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి చెత్త ,పొడి చెత్త,చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని అలాగే గ్రామంలో ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ప్లాస్టిక్ ని నిషేధించాలని గ్రామస్తులు సహకరించాలని కోరారు.అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రియాంక,పంచాయతీ సెక్రటరీ సంజయ్, గ్రామస్తులు,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మినీ వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించిన సర్పంచ్

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని బాగాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీ వేద ప్రణీత్ రెడ్డి మినీ వాటర్ ట్యాంకులకు శుభ్రపరచి నూతనంగా రంగులు వేయించారు.అలాగే గ్రామం లోని చెత్తాచెదారం లేకుండా డ్రైన్ల పారిశుద్ధ కార్మికులచే శుభ్రపరిచారు.అలాగే గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి ముందర మురికి నీరు ఉండకుండా చూసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరిన్ని సలహాలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్యాన్ల వితరణ

ప్రజాపక్షం / పెంచికల్‌పేట్‌: వెనుకబడిన ప్రాంతాల్లో సామాజిక సేవలు అందించడం అభినందనీయమని ఎంపిడిఒ శ్రీనివాస్‌, సర్పంచ్‌ భక్తు రామచందర్‌ అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జోషీ మెమోరియల్‌ ట్రస్ట్‌ అందించిన 5 సీలింగ్‌ ఫ్యాన్లను ట్రస్ట్‌ సభ్యులు గడ్డం మహేష్‌ గౌడ్‌, కొయ్యడ రాజ గౌడ్‌తో కలిసి వైద్యాధికారి అశ్విన్‌కు అందజే శారు. మండలంలో ఇప్పటివరకు ట్రస్ట్‌ ఆరు సేవా కార్యక్రమాలు చేపట్టిందని, భవిష్యత్తు లోనూ కొనసాగించాలని కోరారు. ఈ కార్య క్రమంలో ట్రస్ట్‌ సభ్యులు భీమవ్వ, అశోక్‌, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్‌, ఆసు పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలిగా కృష్ణవేణి ఏకగ్రీవం

ప్రజాపక్షం / పెంచికల్‌పేట్‌: పెంచికల్‌పేట్‌ మండల సర్పంచ్‌ల సంఘం నూతన అధ్యక్షు రాలిగా దరోగపల్లి సర్పంచ్‌ బొట్టుపెల్లి కృష్ణ వేణి, ఉపాధ్యక్షుడిగా పోతేపల్లి సర్పంచ్‌ దుర్గం పోశన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండలం లోని సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలి పారు. సర్పంచులకు ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటూ వారి సమస్యలను ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా నని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, సర్పం చుల హక్కుల సాధనకు సమష్టిగా పనిచేస్తా మన్నారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత టైలరింగ్‌ శిక్షణ

ప్రజాపక్షం / జైపూర్‌: సింగరేణి థర్మల్‌ పవర్‌ ప్లాంట్‌ (ఎస్‌టిపిపి) పరిధిలోని ప్రభావిత గ్రామాల నిరుద్యోగ మహిళలకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మూడు నెలల టైలరింగ్‌ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌టి పిపి ఇడి సిహెచ్‌. చిరంజీవి తెలిపారు. ప్రభా విత ప్రాంతాల్లో ఇప్పటికే బ్యూటీషియన్‌, ఫ్యాషన్‌ డిజైనింగ్‌ శిక్షణలు పూర్తి చేశామని, మహిళల కోరిక మేరకు మళ్లీ టైలరింగ్‌ శిక్షణ ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పదో తర గతి ఉత్తీర్ణతతో పాటు టైలరింగ్‌ సర్టిఫికేట్‌ కలి గిన వారు ట్యూటర్‌ పోస్టుకు అర్హులని, ఎంపి కైన వారికి గౌరవ వేతనం అందిస్తామని స్పష్టం చేశారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ప్రజాపక్షం / కెరమెరి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్‌) ప్రక్రి యలో అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు కావాలని సిఐటియు మండల కన్వీ నర్‌ కూటికెల ఆనంద్‌ రావు కోరారు. ఎన్నికల అధికారులు చేపడుతున్న ఎస్‌ఐఆర్‌ ప్రక్రి యలో భాగంగా తనకు అందిన నోటీసు ఫామ్‌ను మంగళవారం కెరమెరి మండలంలో బిఎల్‌ఒ గుణసుందరికి ఆయన అందజేశారు. ఓటరు జాబితాలో వివరాల పరిశీలన, సవరణ లకు సంబంధించి అందిన నోటీసు వివరాలను పూర్తి చేసి సమర్పించినట్లు పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్‌ కోసం రాజ్యాంగ సవరణకు నిరసన ప్రదర్శన




ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్‌: బిసి రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్‌ చేస్తు మంగళ వారం జాతీయ బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వ ర్యంలో మంచిర్యాల ఐబి చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్‌ మాట్లా డుతూ, దేశంలో, రాష్ట్రంలో బిసిల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని గత 40 సంవత్సరాలుగా ఉద్య మాలు చేస్తున్న నేపథ్యంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ తీర్మానం చేసి పంపాయని గుర్తుచేశారు. తెలం గాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలు బిసిలకు రిజర్వేషన్‌ కల్పించా లనే అంశంపై తీర్మానం చేసి పంపాయని కానీ బిసిలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం 14 శాతం ఇప్పటి వరకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులాలకు ఇడబ్ల్యుఎస్‌ పేరుతో పది శాతం రిజర్వేషన్‌ కల్పించిన కేంద్ర ప్రభుత్వం బిసిల న్యాయమైన డిమాండ్‌ ను గుర్తిం చకపోవడం బాధాకరమని సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వే షన్‌ అని బూచిగా చూపిస్తు రాజ్యాంగ సవరణ చేయ డంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిం చారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిసిల న్యాయమైన డిమాండ్‌ ను పరిష్కరించా పంచా యితీ నుండి పార్లమెంటు దాకా బిసి జనాభా ప్రాతిపది కన అవకాశాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఈ నిర సన కార్యక్రమంలో తెలంగాణ బిసి కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మంచర్ల సదానందం, నాయకులు సీని యర్‌ న్యాయవాది ఆరె లచ్చన్న, గజ్జెల్లి వెంకటయ్య, శాఖ పురం భీంసేన్‌, పెద్దపల్లి సూర్య, చంద్రకాంత్‌, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌ కమిషనర్‌ను బదిలీ చేయాలి

### డాక్టర్‌ రాజా రమేష్‌, రామడుగు లక్ష్మణ్‌



ప్రజాపక్షం/రామకృష్ణాపూర్‌: క్యాతనపల్లి మున్సిపా లిటీలో పాలన గాడి తప్పిందని, అభివృద్ధి పనులకు అడ్డం కిగా మారిన కమిషనర్‌ మురళీకృష్ణను వెంటనే బదిలీ చేయాలని బిఆర్‌ఎస్‌, సిపిఐ నాయకులు డిమాండ్‌ చేశారు. మంగళవారం మున్సిపల్‌ కార్యాలయంలో కౌన్సిల్‌ సమావేశం జరుగుతున్న సమయంలో పాలకవర్గా నికి మద్దతుగా కార్యాలయం ఎదుట నాయకులు ఆందో ళన చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్‌ నియోజకవర్గ నాయకుడు డాక్టర్‌ రాజా రమేష్‌, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌ మాట్లాడుతూ కమిషనర్‌ ఏకపక్ష నిర్ణ యాలతో అభివృద్ధి కుంటుపడుతోందని మండిపడ్డారు. కౌన్సిల్‌ తీర్మానాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి సమస్యలను ఎన్నిసార్లు చెప్పినా పరిష్కరించడం లేద న్నారు. దళిత మహిళ అయిన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించేలా కమిషనర్‌ ప్రవర్తిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్ర మాలు, ప్రభుత్వ సమావేశాల సమాచారం కూడా ఇవ్వ కుండా చైర్‌పర్సన్‌ ప్రాధాన్యతను తుంగలో తొక్కడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తున్న కమిషనర్‌ను బదిలీ చేసి సీనియర్‌ అధికారిని నియమించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ కౌన్సిలర్లు, బిఆర్‌ఎస్‌, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర జీవనశైలితోనే గుండె పదిలం

### ఎస్‌వి పాఠశాల ప్రిన్సిపాల్‌ సంజయ్‌ కుమార్‌



ప్రజాపక్షం / రెబ్బన: చిన్న వయసు నుంచే ఆరోగ్యకర మైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఎస్‌వి ఇంగ్లీష్‌ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్‌ దీకొండ సంజయ్‌ కుమార్‌ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మండల కేంద్రంలోని ఎస్‌వి ఇంగ్లీష్‌ మీడియం పాఠశాలలో విద్యార్థులకు గుండె ఆరోగ్యం, గుండె జబ్బుల నివారణ, ఆహారపు అలవాట్లపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులకు దారితీసే అనారోగ్యకర ఆహారపు అలవాట్లకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. అధిక కొవ్వు, ఉప్పు, చక్కెర పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతి కూల ప్రభావం పడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలకు చిప్స్‌, కుర్‌కురే వంటి జంక్‌ ఫుడ్‌ తీసుకురావద్దని, వాటి స్థానంలో పండ్లు, పోషక విలువలున్న ఆహారం మాత్రమే తేవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, ఆటలకు సమయం కేటాయించాలని, కుటుంబ సభ్యులకు సైతం గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్‌ హిమబిందు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌, మంజు, సురేష్‌, నీలిమ, మేఘన, రూప, అరుణ, మహేం దర్‌, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వయం విత్తనోత్పత్తితోనే సాగు ఖర్చులకు చెక్‌

ప్రజాపక్షం / ఆసిఫాబాద్‌: రైతులు ప్రైవేట్‌ కంపెనీలపై ఆధారపడకుండా కంది విత్తనాలను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంపై దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టిఆర్‌వికె) సమన్వయకర్త డా. ఎం. మధు సూచించారు. ఆసిఫాబాద్‌ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్‌) ఆధ్వర్యంలో, నాబార్డు ఆర్థిక సహకారంతో విత్తనోత్పత్తిపై రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తన తయారీకి నేర్పాటు దూరం పాటించడం, పంట పరిశుభ్రత, కల్తీల ఏరివేత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలతో పాటు పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్యాక్స్‌ సిఇఒ రమణ మాట్లాడుతూ రైతు నుంచి రైతుకే విత్తనం అనే విధా నంతో ప్రతి ఒక్కరికీ తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌, రెబ్బన ప్యాక్స్‌ సిఈఓ శ్రీనివాస్‌, రైతులు పాల్గొన్నారు.



## తీరిన ఏళ్ల నాటి సమస్య.. రోడ్డు పనులకు శ్రీకారం

ప్రజాపక్షం / కాగజ్‌ నగర్‌: కాగజ్‌నగర్‌ పట్టణ మున్సిపాలిటీ పరి ధిలోని 1వ వార్డులో రూ.1.58 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌, సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌ బాబు భూమి పూజ చేసి ప్రారంభించారు. 1వ వార్డు పరిధిలో గత కొన్నేళ్లుగా సరైన రహ దారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై స్థానిక కౌన్సిలర్‌ అఫ్జల్‌ బేగం, తాజ్‌ బాబా ప్రజాప్రతిని ధులు, మున్సిపల్‌ చైర్మన్‌ షాహీన్‌ సుల్తానా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి నిధులు మంజూరు చేయించి పనులను ప్రారం భించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ షాహీన్‌ సుల్తానా, మున్సిపల్‌ కమిషనర్‌, స్థానిక కౌన్సిలర్లు, అధికా రులు, నాయకులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్‌సి సెల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సతీష్‌

ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్‌: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్ట ణానికి చెందిన కాంపెల్లి సతీష్‌ టిపిసిసి ఎస్‌సి సెల్‌ జిల్లా జనరల్‌ సెక్రెటరీగా నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్‌సి సెల్‌ చైర్మన్‌ పైడిమల నర్సింగ్‌ ఆయనకు నియామక పత్రాన్ని అందజే శారు. ఈ సందర్భంగా సతీష్‌ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మానకొండూరు ఎమ్మెల్యే, టిపిసిసిసి రాష్ట్ర ఎస్‌సి సెల్‌ చైర్మన్‌ కవ్వంపల్లి సత్యనారాయణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ వెంకటస్వామి, జిల్లా ఎస్‌సి సెల్‌ చైర్మన్‌ పైడిమల నర్సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌సి వర్గాల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తూ కాంగ్రెస్‌ బలోపేతానికి అంకితభా వంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. సతీష్‌ నియామకంపై పట్టణ కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినంద నలు తెలిపారు.

## గురుడుపేట బడిలో ప్రీ-ప్రైమరీ తరగతులు

### ఎంఇఒ గోడం నానాజీ

ప్రజాపక్షం / కౌటాల : చిన్నారుల భవిష్యత్‌ విద్యాభ్యాసానికి ప్రీ ప్రైమరీ తరగతులు బలమైన పునాదిగా నిలుస్తాయని కౌటాల మండల విద్యాశాఖాధికారి గోడం నానాజీ తెలిపారు. మండలం లోని గురుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీప్రైమరీ తరగతి గదులను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్ననాటి నుంచే చిన్నారుల్లో విద్యపై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ తరగతులు దోహదపడతా యని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌ రాగిసిడాం భీమవ్వ, కౌటాల జెడ్పీహెచ్‌ఎస్‌ ప్రధానోపాధ్యాయులు బి. రాంచందర్‌, ఉప సర్పంచ్‌ మేకల రాజేష్‌, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌ శ్రీదేవి, మాజీ మండల అధ్యక్షులు నికాడె గంగారాం, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమతి లేని ఇసుక రవాణాపై చర్యలు

### తహసీల్దార్‌ రహీముద్దీన్‌ హెచ్చరిక

ప్రజాపక్షం / సిర్పూర్‌ (టి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ రహీముద్దీన్‌ హెచ్చరించారు. సిర్పూర్‌ (టి) మండలం లోని అచ్చెలి గ్రామ పంచాయతీ పరిధి రుద్రారం రైల్వే బ్రిడ్జి వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అంద డంతో ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అధికా రుల రాకను గమనించిన డ్రైవర్లు ఖాళీ ట్రాక్టర్లతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ ఇసుక లోడింగ్‌ ప్రదేశాల్లో కనిపించే ఖాళీ వాహనాలను సైతం సీజ్‌ చేస్తామ న్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ఇసుక రవాణాకు పాల్ప డితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల ప్రగతికే భవిత కేంద్రాలు

ప్రజాపక్షం / కాగజ్‌ నగర్‌: దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం సమగ్ర శిక్ష అభియాన్‌ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నామని మండల విద్యాధి కారి వాసాల ప్రభాకర్‌ తెలిపారు. కాగజ్‌నగర్‌ పట్టణంలోని జెడ్పి ఎస్‌ఎస్‌ పెట్రోల్‌ పంపు ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, బోధనలో వస్తున్న నూతన మార్పులను ఉపాధ్యాయులు అందిపు చ్చుకోవాలన్నారు. భవిత కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ కోఆర్డినేటర్‌ అబిద్‌ అలీ, విలీన విద్య కోఆర్డినేటర్‌ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిఎం సభపై వేములవాడ బిఆర్ఎస్ నాయకుల విమర్శల సుడిగాలి

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** సిరిసిల్ల పట్టణంలో బుధవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల సభకు రానున్న ముఖ్యమంత్రి పర్యటనను ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గానికి రానున్న ముఖ్యమంత్రికి వేములవాడ పట్టణ బిఆర్ఎస్ పార్టీ తరపున స్వాగతం పలుకుతున్నామని, అయితే ఈ పర్యటన సందర్భంగా తమ ప్రాంతానికి సీఎం ఏం నిధులు కేటాయిస్తారోనని ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. గతంలో నిండు శాసనసభ వేదికగా ప్రతిపక్షంపై చేసిన 8,000 ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా ఆరోపణలకు సంబంధించి సీఎం ధైర్యముంటే ఆధారాలతో నిరూపించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల నియోజకవర్గాన్ని నాటి మంత్రి కేటీఆర్ వేల కోట్ల నిధులతో మోడల్ సిటీగా తీర్చిదిద్దారని నాయకులు గుర్తుచేశారు. జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలకు రూ. 400 కోట్లు, మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ. 166 కోట్లు, అగ్రికల్చర్ కళాశాలకు రూ. 90 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మౌలిక వసతులు, రోడ్ల విస్తరణకు వందలాది కోట్లు తెచ్చి ప్రగతి పథంలో నడిపారని, మరి ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం అంతకంటే ఎక్కువ నిధులు తీసుకువస్తుందో లేదో సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. కేటీఆర్ అంటే తెలంగాణకే ఒక యంగ్ మోడల్ నాయకుడని, ఆయన స్థానాన్ని దెబ్బతీయడం సీఎం వల్ల కాదని, ధైర్యముంటే కేటీఆర్‌పై పోటీ చేసి గెలవాలని సవాలు విసిరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రైతులకు రెండు విడతల రైతు బంధు ఎగ్గొట్టారని, యూరియా కొరత వేధిస్తోందని, 24 గంటల ఉచిత విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. రైతు బీమా ఎల్ఐసీ ప్రీమియం చెల్లించలేక చేతులెత్తేశారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని మోసం చేశారని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. దివ్యాంగులు, బాధితులకు పెన్షన్లను రూ. 4,000కు పెంచుతామన్న మాట తప్పారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చకుండా కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసిందని సాకులు చెప్పడం సిగ్గుచేటని హితవు పలికారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామతీర్థపు రాజు, గూడూరి మధు, నిమ్మ శెట్టి విజయ్, గోలి మహేష్, మారం కుమార్, సుంకపాక రాజు, సిరిగిరి చందు, కొండ కనకయ్య, వాసాల శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కళాకారుల సంఘం అధ్యక్షుడికి సన్మానం



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా ఎన్నికైన గంగాధరి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆకెనపల్లి గ్రామ రామాయణం బృందం మంగళవారం శాలువాతో సన్మానించింది. ఈ కార్యక్రమంలో సర్పంచి గాదె స్రవంతి, కళాకారులు కానుగంటి తిరుపతి, గాదె సుధాకర్, ఐలవేణి సంతోష్, బరిగెలా సతీష్, సామల కుమార్, కట్కూరి లక్ష్మ ణ్, గుడికందుల గురువయ్య, శ్రీరాముల సత్తయ్య, ఆకుల రాము, మాదరవేని గట్టయ్య, మామిడాల రాయబోసు పాల్గొన్నారు.

## కమిషనరేట్‌లో ఎస్ఐల బదిలీలు

**ప్రజాపక్షం/రామగుండం :** కాళేశ్వరం జోన్1 రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అయిదుగురు ఎస్.ఐ.లను బదిలీ చేస్తూ డీఐజీపీ(ఎఫ్ఎసీ) కమిషనర్ ఆఫ్ పోలీసు రామగుండం ఉత్తర్వులు జారీ చేశారు. జి.హరిశేఖర్‌ను ట్రాఫిక్ పీఎస్ నుంచి రామగుండం పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, రామగుండం పీఎస్ ఎస్‌హెచ్‌వో జి.సంధ్యారాణిని వీఆర్‌గా కమిషనరేట్‌కు, టి.ఉదయ్‌కిరణ్‌ను ఎన్‌టిపిసి పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి అంతర్గాం పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, బి.వెంకటస్వామిని అంతర్గాం పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి ఎన్‌టిపిసి పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, కె.శ్రీనివాస్ డీఎస్బీ జయశంకర్ భూపాలపల్లి నుంచి గోదావరిఖని ఒకటో పట్టణ పీఎస్ ఎస్ఐ3గా బదిలీ చేశారు. పరిపాలన కారణాల వల్ల తక్షణమే అమల్లోకి వచ్చేలా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

## శ్రీనగర్ వేదికగా థాంగ్-టా సమరం




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్) విద్యార్థులు తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో నలుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో బరిలోకి దిగారు. ఏ. అద్వైత్ 56 కేజీల విభాగంలో, ఎం. సంప్రీత్ 46 కేజీల విభాగంలో, కె. మైత్రి వరుణ్ 52 కేజీల విభాగంలో, టి.ధనుష్‌కుమార్ 56 కేజీల విభాగంలో పోటీల్లో పాల్గొంటున్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ తరపున తమ ప్రతిభను ప్రదర్శిస్తూ సత్తా చాటుతున్నారు.విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేశారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొంటూ,పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు,తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కోల్ ఇండియా స్థాయిలో రాణించాలి

**ప్రజాపక్షం/రామగిరిః** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి కబడ్డీ,బాల్ బ్యాట్మింటన్ పోటీలను మంగళవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని, పతాకావిష్కరణ గావించి, రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఈ పోటీల్లో బెల్లంపల్లిమందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం 1,2, రామగుండం 3 భూపాలపల్లి, మణుగూరుఇల్లందు,కార్పోరేట్‌కొత్తగూడెం ఆరు రీజియన్ల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిఎంలు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం తోపాటు,



మానసిక ఉల్లాసం కలుగుతుందని, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను ప్రతి గ్రామంలో ఆడేవారని అన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఉద్యోగుల క్రీడల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ సహకారంతో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహించిన పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో,అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి.జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మ ణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో



దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, నోడల్ ఆఫీసర్ శోభారాణి, జోనల్ కన్వీనర్ దాసరి రమేష్,మండల కన్వీనర్ ప్రణయ్,సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేములవాడ మున్సిపల్ సాధారణ సమావేశం

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ మున్సిపల్ పాలకవర్గ ఆధ్వర్యంలో వచ్చే నెలలో జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు మరియు కోఆప్షన్ సభ్యులతో వచ్చే నెలలో జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల గురించి చర్చించడం జరిగిందని, అలాగే పట్టణంలో చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతులపై అధికారులు పాలకవర్గ సభ్యులు తో చర్చించడం జరిగిందని, అలాగే వార్డులలో సమస్యలపై గౌరవ కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకవస్తే అధికారులు సమస్యను స్వతారమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో




గౌరవ పాలకవర్గ సభ్యులు మరియు కోఆప్షన్ సభ్యులు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, అభినవ్, అన్వేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శివ కుమార్, ఆర్ఐ రాజేందర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర పరిపాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది!

**ప్రజాపక్షం/అంతర్గాం :** కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమిలో ఏకపక్ష నిర్ణయాలు సాగుతున్నాయని, సమీకృత సామాజిక దృక్పథం కలిగిన భాగస్వామ్య పక్షాలే వాటిని ప్రశ్నిస్తున్న తీరు చూస్తే వారి పరిపాలన ఎలా ఉందో అర్థమౌతుందని పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామగుండం ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగయ్య అన్నారు. పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, యువత పట్ల ఎన్‌డిఎబీజెపీ కూటమి అవలంభిస్తున్న తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని,అదే వారి పట్ల ప్రజా తిరస్కారానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను జేబు సంస్థలుగా మార్చుకుని ప్రతిపక్షాలను, ప్రశ్నించే వారిని అణిచివేస్తున్నారని ఆయన విమర్శించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/రామగుండం :** శాంతి భద్రతల పరిరక్షణతోపాటు మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, వేధింపులపై తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు అండగా ఉంటామని రామగుండం నూతన ఎస్.ఐ. జి.హరిశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ.గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత రామగుండం లక్ష్యంగా గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తప్పవని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన మందల లస్మమ్మ మృతి చెందగా,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లస్మమ్మ గారు మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డి అత్తమ్మ,.కాల్వ శ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల సమ్మయ్య తల్లి ఈర్ల మల్లమ్మ మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యాల తిరుపతి రెడ్డి మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.